సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 21 । మే । 2023



మృతదేహంతో నిరసన

తీసుకున్న అప్పు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహంతో నిరసనకు దిగారు. 8లో▸

రానా సందడి

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో శనివారం నిర్వహించిన వేసవి శిబిరాల ముగింపు కార్యక్రమంలో సినీనటుడు దగ్గుబాటి రానా సందడి చేశారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు, తెనాలి రామకృష్ణ నృత్య రూపకం అలరించింది. కార్యక్రమంలో హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ జే నోరియా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమృత చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

24న విత్తన మేళా

కొందుర్గు: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 24న విత్తన మేళా జరుగుతుందని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ శనివారం తెలిపారు. ప్రస్తుతం వునాస సీజన్‌లో సాగుకు అవసరమైన చిరుధాన్యాలు, ఇతర విత్తనాలు అందుబాటులో ఉంటాయని, అవసరమైన రైతులు మేళాకు హాజరై విత్తనాలు పొందాలని సూచించారు.

న్యూస్‌రీల్

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి



కాస్లాబాద్ పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి

కొందుర్గు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డీపీఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమానికి సంబంధించి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని కాస్లాబాద్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో మురుగు కాల్వలు, వీధులను పరిశీలించారు. చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. దోమలు, ఈగలు ప్రబలకుండా మందులు పిచికారీ చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విధిగా సమావేశం నిర్వహించాలన్నారు. పంచాయతీ సమావేశానికి వార్డు సభ్యులంతా హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ గౌడ్, సర్పంచ్ గోపాల్, ఉప సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

బడంగ్‌పేట్: వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రాన్ని కాంగ్రెస్సే ఏలుతుందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జోస్యం చెప్పారు. కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో శనివారం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇందిరానగర్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయాల నుంచి బీజేపీ, టీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన సుమారు 100 మందివరకు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ ఆదరణ తగ్గలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్‌గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కళ్లెం సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



వైద్యులతో అవయవ మార్పిడి రోగులు

బంజారాహిల్స్: ప్రముఖ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అవయవ మార్పిడి రోగుల కోసం కేర్ కనెక్ట్ పేరిట వినూత్న కార్యక్రమం చేపట్టింది. వైద్యులు, రోగుల మధ్య స్నేహపూరిత వాతావరణం పెంపొందించడంతో పాటు వారిలో మనో ధైర్యాన్ని కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో శనివారం అవయవ మార్పిడి రోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి ఆతిథ్య రోగుల సంరక్షణ విభాగం గ్రూప్ ఉపాధ్యక్షుడు విజయ్ సేథి, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్లు అజిత్ సింగ్, ప్రసాద్ రాజు, బీకేఎల్ శాస్త్రి, టీవీఎస్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీపై నజర్

- నాసిరకం విత్తనాలు, పురుగుల మందులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- వ్యవసాయ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు
- ఫర్టిలైజర్స్ దుకాణాలు, విత్తన తయారీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు

షాద్‌నగర్: ఖరీఫ్ సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. దళారులు ఊరూరా తిరుగుతూ రైతులను నమ్మించి నకిలీ విత్తనాలు అంటగట్టే ఆస్కారం ఉంది. దుకాణాల్లో వ్యాపారులు కాలం చెల్లిన విత్తనాలు, పెస్టిసైడ్ మందులను అంటగట్టే అవకాశం ఉంది. సత్తువ లేని విత్తనాలు అమ్మి రైతులను ముంచే ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ క్రమంలో నకిలీల ఆటకట్టించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపింది.

రంగంలోకి టాస్క్‌ఫోర్స్

వానాకాలంలో చాలా మంది రైతులు పత్తి, మొక్కజొన్న పంటలను అధిక శాతం సాగు చేస్తుంటారు. ఇదే సమయంలో నకిలీ, అనుమతి లేని విత్తనాలు, నిషేధిత మందులు విక్రయించేందుకు వ్యాపారులు ప్రయత్నాలు చేస్తుంటారు. నకిలీ విత్తనాలు విత్తి దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్సు బృందంలో వ్యవసాయశాఖ ఏడీఏ, సీఐ, ఎస్‌ఓటీ, ఎస్‌సీఓ (సీడ్ సర్టిఫయింగ్ ఆఫీసర్)లు ఉన్నారు. అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విత్తనాలు, పురుగుల మందుల స్టాక్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దుకాణాలకు సంబంధించి లైసెన్సులు, విత్తనాల స్టాక్ జాబితాలను పరిశీలిస్తున్నారు. విత్తనాలు, ఫర్టిలైజర్ మందుల విక్రయానికి సంబంధించిన రసీదు పుస్తకాలను తనిఖీ చేస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు

మూడు రోజులుగా టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. తాజాగా శనివారం కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్, శంషాబాద్ ప్రాంతాల్లోని ఫర్టిలైజర్, విత్తనాల తయారీ పరిశ్రమల్లో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం ఏడీఏ ఉషారాణి ఆధ్వర్యంలో శంషాబాద్ ఎస్‌ఓటీ సీఐ సత్యనారాయణ, ఏడీఏ రాజారత్నం, సీడ్‌సర్టిఫికేషన్ ఆఫీసర్ నరేష్ ఏఓ నిషాంత్‌కుమార్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.

విత్తనాల ఎంపికపై జాగ్రత్త

విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- లైసెన్సులు పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన దానికి సంబంధించి డీలర్ల సంతకంతో కూడిన రసీదులు తీసుకోవాలి. రసీదుపై కొనుగోలు చేసిన తేదీ, విత్తనాల రకం, పరిమాణం, ధర, లాట్ నంబర్ తదితర వివరాలను పూర్తి స్థాయిలో రసీదులో నమోదు చేయించుకోవాలి.
- రైతులు రంగురంగు ప్యాకెట్లను చూసి మోసపోవద్దు. కంపెనీ విశ్వసనీయత, విత్తనాల నాణ్యత, మొలక శాతం తదితర వివరాలను పరిశీలించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసిన తర్వాత ఖాళీ విత్తనాల సంచులను పంట చేతికొచ్చే చివరి దశ వరకు జాగ్రత్తగా భద్ర పర్చాలి. తేడా వస్తే ఆధారాలతో వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి.
- కొందరు వ్యాపారులు ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ ప్యాకింగుల్లో నాసిరకం విత్తనాలు నింపి విక్రయించేందుకు ప్రయత్నిస్తుంటారు. విత్తనాలే కాకుండా వాటి ధ్రువీకరణకు వినియోగించే ప్రభుత్వ లేబుళ్లను జాగ్రత్తగా పరిశీలించాలి. అవసరమైతే వ్యవసాయ అధికారులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలి. నాసిరకం పాలిథిన్ సంచుల్లో ఉన్న విత్తనాలు కొనుగోలు చేయొద్దు.
- విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. మొలక శాతం తక్కువగా ఉంటే విత్తనాలను తిరిగి డీలర్‌కు ఇవ్వొచ్చు.
- సీజన్ ప్రారంభం కావడంతో కొందరు బిల్లులు లేకుండా విత్తనాలు అమ్ముతుంటారు. వారిపై వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి.
- విత్తనాలు ఏయే భూముల్లో పండుతాయనే వివరాలు ప్యాకెట్‌పై స్పష్టంగా రాసి ఉంటుంది. సరిచూసుకోవాలి.
- కొనుగోలు చేసి నాటిన వంద విత్తనాల్లో 80 మొలకెత్తితే అవి నాణ్యమైనవని గుర్తించాలి. నకిలీ విత్తనాలైతే మొలకెత్తకపోవడం మొలక శాతం తక్కువగా ఉండటం, ఏపుగా పెరిగినా కాపు లేకపోవడం వంటివి జరుగుతాయి. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలి.
- విత్తనాల మార్కెట్‌ను పెంచడం, అధికంగా విత్తనాలు అమ్మడం కోసం వివిధ కంపెనీలు వ్యాపారులకు బహుమతులు, టూర్ల ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. దీనికి ఆశపడి డీలర్లు విత్తన ప్యాకెట్ల అమ్మకాన్ని పెంచుతారు. నాణ్యమైన విత్తనాలని, మంచి దిగుబడులు వస్తాయని నమ్మించి అంటగట్టే ప్రయత్నం చేస్తారు. అందుకే విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

విధిగా రసీదు పొందాలి



రైతులు ఎరువులు, విత్తనాలు కొన్నప్పుడు విధిగా దుకాణాల యజమానుల నుంచి రసీదులు తీసుకోవాలి. విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి.

– నిషాంత్‌కుమార్, ఏఓ, షాద్‌నగర్

నకిలీవి విక్రయిస్తే చర్యలు తప్పవు



వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కాలం చెల్లిన, ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు, పురుగుల మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించొద్దు.

– రాజారత్నం, ఏడీఏ, షాద్‌నగర్

నో ఫాంహౌస్!

- 111 జీఓ ఎత్తివేత ఫలితం
- మామిడి, జామ, సపోటా, పూల తోటలు మాయం
- వాతావరణంలో భారీ మార్పులకు అవకాశం
- పెద్ద ఎత్తున పుట్టుకురానున్న విల్లా ప్రాజెక్టులు



సాక్షి,సిటీబ్యూరో: నిన్నటి వరకు పచ్చని పంట పొలాలు.. మామిడి, సపోటా.. జామ, గులాబీ, బంతి, చేమంతి ఇతర పూలు, పండ్ల తోటలతో కనువిందు చేసిన ఆ ప్రాంతంలో.. 111 జీఓ ఎత్తివేసి ఆంక్షలు తొలగించడం ద్వారా రాబోయే రోజుల్లో గేటెడ్ కమ్యూనిటీలు.. విల్లాలు.. విశాలమైన రోడ్లు, ఎత్తైన భవనాలతో రద్దీగా మారనుంది. ఇప్పటి వరకు పక్షుల కిలకిలారావాలకు.. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన ఆ పరిసరాలు ఇకపై వాహనాలు, పారిశ్రామిక రణగొణ ధ్వనులతో మార్మోగనుంది. స్వచ్ఛమైన గాలిని పంచిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ అలలు ఇకపై మురుగునీటి దుర్వాసన వెదజల్లుతూ ముక్కుపుటాలు అదరగొట్టనున్నాయి. వాయు కాలుష్యంతో పగటి ఉష్ణోగ్రతల్లోనూ భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశం లేకపోలేదు. ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లకపోయినా.. ఈ ప్రాంతాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

స్వచ్ఛమైన గాలి, నీటి కోసమే..

జంటనగరాలకు తాగునీరు అందించేందుకు అప్పటి నిజాం ప్రభుత్వం నగరానికి పశ్చిమాన ఆరు టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్‌లను నిర్మించారు. నగరవాసులకు ఏళ్ల తరబడి ఈ నీళ్లే జీవనాధారంగా మారాయి. జనాభాతో పాటు నగర విస్తీర్ణం, తాగునీటి అవసరాలు కూడా అనూహ్యంగా పెరగడంతో ప్రభుత్వం సింగూరు, ప్రాణహిత నదుల నుంచి తాగునీటిని తరలించారు. తర్వాత ఇటు కృష్ణా, అటు గోదావరి నదుల నుంచి నీటిని తరలిస్తున్నారు. జంట జలాశయాల పరిరక్షణ కోసం అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో 111 జీఓను తీసుకొచ్చింది. జంట జలాశయాల చుట్టూ పది కిలోమీటర్లు.. 7 మండలాలు.. 84 గ్రామాల పరిధిలో సుమారు 1.32 లక్షల ఎకరాల భూమిని ఈ జీఓ పరిధిలోకి తీసుకొచ్చింది. పంటల సాగు మినహా ఇక్కడ ఎలాంటి వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహించకూడదని ఆంక్షలు విధించింది. ఫలితంగా నీరు కలుషితం కాకుండా సమస్త ప్రాణ కోటికి జీవనాధారంగా మారింది. అంతేకాదు నగరానికి పై భాగంలో నిర్మించిన ఈ నదుల్లోని నీటి అలలపై వీచే స్వచ్ఛమైన, చల్లని గాలి ఆ పరిసర ప్రాంతాలను అహ్లాదంగా మార్చింది.

పండ్లు, పూల తోటలకు నెలవు..

జంట జలాశయాల చుట్టూ సారవంతమైన భూములు ఉండటంతో సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు ఇక్కడ భారీగా భూములు కొనుగోలు చేశారు. వీటి చుట్టూ ఫెన్సినింగ్‌లు, ప్రహరీలు ఏర్పాటు చేసుకున్నారు. ఫాంహౌస్‌లు నిర్మించి వీకెండ్‌లో కుటుంబ సభ్యులతో ఇక్కడికి వచ్చి సేదతీరే వారు. మిగిలిన భూముల్లో పండ్లు, పూల తోటలు సాగు చేయించారు. ఎటూ చూసినా ఎత్తైన చెట్లు కన్పించేవి. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ పగటి ఉష్ణోగ్రతలు కూడా చాలా తక్కువ. వర్షాలు సమృద్ధిగా కురిసేవి. వాతావరణ కాలుష్యం చాలా తక్కువగా ఉండేది. ప్రస్తుతం 111 జీఓ ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడంతో పండ్లు, పూలు, కాయకూరల సాగుతో ఇప్పటి వరకు సిటిజన్ల అవసరాలు తీర్చిన ఈ ప్రాంతం.. భవిష్యత్తులో ఆ అవసరాలు తీర్చలేకపోచ్చని నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

పశ్చిమాన మరో కొత్త నగరం..

నగరానికి పశ్చిమ ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు పెద్ద ఎత్తున ల్యాండ్ బ్యాంక్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రాంతం ఇటు బెంగళూరు హైవేకు.. అటు ముంబై హైవేలకు మధ్యలో ఉండటం, అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఓఆర్ఆర్ ఉండటం పెట్టుబడిదారులకు కలిసి వచ్చే వచ్చే అంశం. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో ఇక్కడ బహుళ అంతస్తుల నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, స్టార్ హోటళ్లు వెలవనున్నాయి. మొత్తంగా ఇక్కడ మరో కొత్త నగరం ఆవిష్కృతమయ్యే అవకాశం ఉంది.

వీరికి ఎయిర్‌పోర్టు మెట్రో సేవలు

మంచిరేవుల నుంచి శంషాబాద్ వరకు ప్రభుత్వం ఎత్తివేసిన జీఓ 111 ప్రాంతవాసులకు ఎయిర్‌పోర్టు మెట్రో సేవలు లభించనున్నాయి. ఔటర్ అంచున ఉన్న మంచిరేవుల, నార్సింగి, తెలంగాణ పోలీస్ అకాడమీ, హిమాయత్‌సాగర్, కిస్మత్‌పురా, బుద్వేల్, రాజేంద్రనగర్, కొత్వాల్‌గూడ, రాళ్లగూడ, తొండుపల్లి, శంషాబాద్, చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, తదితర ప్రాంతాలకు మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. మెట్రో సదుపాయంతో జీఓ 111 ప్రాంతానికి చెందిన ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి రాయదుర్గం, అమీర్‌పేట్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్, జేబీఎస్, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్‌లు.. ఇలా ఎక్కడికైనా వెళ్లేందుకు అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం నాగోల్ నుంచి రాయదుర్గం వరకు ఉన్నట్లుగానే శంషాబాద్ నుంచి రాయదుర్గం వరకు ప్రయాణికుల రద్దీ అత్యధికంగా ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

నోటు పోటు!

- రూ.2 వేల కరెన్సీ మాకొద్దు
- సెప్టెంబర్ 30 వరకు చలామణిలో ఉన్నా వ్యాపారుల వెనుకంజ
- కిరాణా దుకాణాల నుంచి మాల్స్ వరకు..
- ఏది కొనాలన్నా కష్టమే
- బ్యాంకుల్లో మార్పిడి కోసం జనం పరుగులు

సాక్షి, సిటీబ్యూరో: 'రూ.2 వేల నోటా.. బాబోయ్ మాకొద్దు' గ్రేటర్‌లో ఇప్పుడు ఎక్కడికెళ్లినా ఇదే మాట వినిపిస్తోంది. రూ.2 వేల నోటుతో ఎలాంటి వస్తువులను కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. చిల్లర వర్తకుల నుంచి బడా వ్యాపార సంస్థల వరకు రూ.2వేల నోటుపై లావాదేవీలు నిలిచిపోయాయి. ఈ నోటును చలామణిలోంచి ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన కొద్ది క్షణాల్లోనే రూ.2 వేల నోటుపై అన్ని రకాల లావాదేవీలు స్తంభించాయి. వాస్తవానికి సెప్టెంబర్ 30 వరకు లీగల్‌గా చలామణి చేసుకొనే అవకాశం ఉన్నట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ నెల 23 నుంచి ఈ నోట్ల మార్పిడికి వెసులుబాటు కల్పించింది. నిబంధనల మేరకు అన్ని రకాల వస్తుసేవల కొనుగోళ్లలో ఈ నోట్లను వినియోగించవచ్చు. మార్కెట్‌లో మాత్రం ఆ పరిస్థితి లేదు. శనివారం సాయంత్రం నుంచే రూ.2 వేల నోటు స్తంభించింది. దీంతో షాపింగ్ మాల్స్, వైన్ షాప్స్, పెట్రోలు బంకుల్లో నోటును తీసుకోవడానికి సిబ్బంది నిరాకరిస్తున్నారు. ఈ నెల 22 వరకు నేరుగా తీసుకునే వెసులుబాటు ఉన్నా చాలా వరకు వెనుకంజ వేస్తున్నారు.

కూరగాయల దుకాణం నుంచి మాల్స్ వరకు..

'రిజర్వ్‌బ్యాంకు ఉన్నపళంగా రెండు వేల నోట్లను చెల్లుబాటు నుంచి రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో పెద్ద నోట్ల రద్దు నాటి కాలం గుర్తుకొస్తోంది. ఈ నోటు తీసుకొని ఎక్కడికి వెళ్లినా వెనుదిరగాల్సివస్తోంది' అని కుషాయిగూడకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. కూరగాయల దుకాణం నుంచి షాపింగ్‌మాల్స్, సూపర్ మార్కెట్ల వరకు అన్ని చోట్లా ఇదే పరిస్థితి. బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు ఎలాంటి చిక్కులెదురవుతాయోనన్న భయంతో వ్యాపారులు వెనుకంజ వేస్తుండగా నోట్ల మార్పిడి కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయడం తమతో కాదంటూ చిరువర్తకులు చేతులెత్తేస్తున్నారు. దీంతో ఈ నోటుకు లీగల్‌గా ఇంకా చెల్లుబాటు ఉన్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. 'చాలా వరకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి డిజిటల్ కరెన్సీనే వినియోగిస్తున్నాం. ఈ నోట్ల చలామణికి ఇంకా అవకాశం ఉంది కదా అని వెళ్తే మాత్రం చుక్కెదురవుతోంది' అని ఉప్పల్‌కు చెందిన సుధాకర్‌రెడ్డి తెలిపారు.



మార్పిడి కోసం ఎదురుచూపులు..

మరోవైపు ఇంటి అవసరాల కోసం కొద్దిమొత్తంలో దాచుకున్న జనం రూ.2 వేల నోట్లను మార్పిడి చేసుకొనేందుకు ఎదురు చూస్తున్నారు. ప్రతి రోజు రూ.20 వేల చొప్పున మార్చుకొనేందుకు ఈ నెల 23 నుంచి వెసులుబాటు ఉండడంతో బ్యాంకుల వద్ద పెద్దఎత్తున జనం బారులు తీరే అవకాశం ఉంది. తమ బ్యాంకు ఖాతాల్లో రెండు వేల నోట్లను జమ చేసుకొనేందుకు ఎలాంటి పరిమితుల్లేవు. కానీ ఖాతాలతో సంబంధం లేకుండా ఏ బ్యాంకు నుంచైనా మార్చుకొనేందుకు మాత్రం రూ.20 వేల వరకే అవకాశం ఉంది.

డయేరియాపై అవగాహన కల్పించండి

- వైద్యాధికారులకు అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు సూచన

ఇబ్రహీంపట్నం రూరల్: డయేరియా నివారణ, చికిత్సకు ఓఆర్‌ఎస్‌తో పాటు జింక్ మాత్రలు తప్పనిసరిగా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు వైద్యాధికారులకు సూచించారు. జూన్‌లో డయేరియా నివారణ పక్షం సందర్భంగా శనివారం జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డయేరియా నివారణలో భాగంగా ప్రతి కుటుంబానికి ఓఆర్‌ఎస్, జింక్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యక్రమంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. జూన్ 5 నుంచి 17వ తేదీ వరకు డయేరియా నివారణ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మీజిల్స్, రూబెల్లా వ్యాధుల సర్వేలెన్స్, చికిత్స, ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, సర్వేలెన్స్ మెడికల్ అధికారి డా.అజహర్ మాట్లాడుతూ.. జిల్లాలో మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ ఎంఆర్‌ఐ-1, ఎంఆర్‌ఐ-2 ద్వారా వ్యాధిని అరికట్టేందుకు ఐసీడీఎస్, ఎడ్యుకేషనల్, డీఆర్ డీఏ అధికారులు సహకారం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.స్వర్ణకుమారి, మలేరియా అధికారి డా.రాకేష్, జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, గణాంక అధికారి రాజ్‌కుమార్, ఉప వైద్యాధికారులు డా.ధరణికుమార్, డా.గీత, డా.జయలక్ష్మి, డా.దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



మీజిల్స్, రూబెల్లా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు, వైద్యాధికారులు

చదువుపై దృష్టి సారించండి

- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

షాద్‌నగర్: పేదరికం అనేది చదువుకు అడ్డం కాదని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక సహకారంతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే పేదరికం, తల్లిదండ్రులు, ఆర్థిక సమస్యలు, కులం, మతం సామాజిక సమస్యలు అడ్డంకి కానే కావని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించాలని.. పాఠశాల, కళాశాలకు ఎందుకు వెళ్తున్నామని తమను తాము ప్రశ్నించుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని.. ఫెయిలైతే నిరుత్సాహ పడిపోవద్దని పేర్కొన్నారు. రెట్టించిన ఉత్సాహంతో మరింత పట్టుదలతో చదవాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని తద్వార విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. అదేవిధంగా పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమ్మర్ సైన్స్ ఫెయిర్ ముగింపు నిర్వహించారు. మాజీ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రజలు మూఢనమ్మకాల వైపు వెళ్లకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ భానుప్రకాష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకుమార్

మరణం లేని 'సిరివెన్నెల'

గన్‌ఫౌండ్రీ: రణమే తప్ప మరణం లేని వ్యక్తి సిరివెన్నెల సీతారామశాస్త్రి అని సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎమెస్కో బుక్స్ ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత చంబోలు శ్రీరామశాస్త్రి రచించిన 'పూర్ణత్వపు పొలిమేరలో' పుస్తకాన్ని ఆవిష్కరించారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు సినీ అభిమానుల హృదయాల్లో సిరివెన్నెల చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు.

ఇంట్లో చోరీ

నాలుగు తులాల ఆభరణాలు అపహరణ

మీర్‌పేట: ఇంట్లో దొంగలు పడి నాలుగు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గుల్ వెంకటాద్రినివాస్ ఫేజ్–2కు చెందిన బొల్లా సురేందర్‌రెడ్డి ఈ నెల 19న కుటుంబ సభ్యులతో కలిసి సంగారెడ్డిలోని ఓ శుభకార్యానికి వెళ్లారు. కూతురు ఇంటికి తాళం వేసి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు బీరువాలోని నాలుగు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఆమె 9 గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ కొంత నగదు చోరీ జరిగినట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

షాబాద్: ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రి గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు కూతురు చాకలి మాధవి అలియాస్ కవిత (26)ను షాబాద్ మండలం మన్‌మర్రి గ్రామానికి చెందిన మల్లేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. రాత్రి అందరూ తిని పడుకున్న తరువాత బెడ్ రూమ్‌లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నా చెల్లెలు మృతిపై అనుమానం ఉందని మృతిరాలి అన్న మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కవిత మృతదేహం

అప్పు డబ్బులు ఇవ్వాలని శవంతో నిరసన

షాద్‌నగర్‌రూరల్: తీసుకున్న అప్పు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహంతో నిరసనకు దిగారు. ఈ ఘటన షాద్‌నగర్ పట్టణంలోని భగీరథ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామానికి చెందిన కాట్న సత్యనారాయణ (43) తనకున్న కొంత భూమిని విక్రయించాడు. భూమి అమ్మగా వచ్చిన డబ్బులను ఏడేళ్ల క్రితం కొత్తూరు మండలం ఎస్‌బీ పల్లికి చెందిన ఎర్ర శ్రీనివాస్‌కు సుమారు రూ.20లక్షలు అప్పుగా ఇచ్చాడు. అయితే తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని కోరుతూ సత్యనారాయణ కొంత కాలంగా షాద్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎర్ర శ్రీనివాస్ వద్దకు తిరుగుతున్నాడు. అయితే ఎర్ర శ్రీనివాస్ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అనారోగ్యానికి గురైన కాట్న సత్యనారాయణ ఇటీవల హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని నేరుగా ఎర్ర శ్రీనివాస్ ఇంటి వద్దకు తీసుకొచ్చి ధర్నా చేపట్టారు. అప్పు తీసుకున్న దానిలో కొంత మొత్తాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి మిగతా డబ్బులకు కొన్ని రోజుల గడువు కోరడంతో వారు ఆందోళన విరమించారు.



ఇంటి ఎదుట మృతదేహం ఉంచి నిరసన చేపడుతున్న కుటుంబ సభ్యులు